Digital, tmedia.net.in

# టీ-మీడియా

ఖమ్మం
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 118
సంచిక : 238
పేజీలు : 4
ఆదివారం, మే 10, 2026

GSTIN: 36FDKPS1308P1ZX | Analytics ID: UA-194163459
Domain ID : DC7812B9B3101414BB98847D724E48B3A-IN

## చెరువు మట్టితో భూమి సారవంతం-అధిక దిగుబడులు సాధ్యం

### జిల్లా వ్యవసాయ అధికారి దనసరి పుల్లయ్య



**టీ మీడియా,మే09, సింగరేణి(కారేపల్లి):** మండలంలోని అప్పాయిగూడెం చెరువులో ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి దనసరి పుల్లయ్య పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువు మట్టిని వ్యవసాయ భూముల్లో వేసుకోవడం వల్ల భూమిలో పోషకాలు పెరిగి సారవంతత మెరుగుపడుతుందని తెలిపారు. దీంతో పంటలకు అవసరమైన సూక్ష్మ పోషకాలు అందడంతో రైతులు అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉంటుందని వివరించారు. రైతులు చెరువు మట్టిని వినియోగించుకోవడం ద్వారా భూమి నాణ్యత మెరుగుపడి పంట ఉత్పత్తి పెరుగుతుందని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ వెంకట్ నాయక్ ,ఇరిగేషన్ ఏఈ నాగయ్య, అప్పాయిగూడెం సర్పంచ్ దండు ప్రవీణ్ కుమార్, ఏఈవోలు మున్ని, పాల్గొన్నారు.

# మద్యం షాపుల దందా..?

### -ఎమ్మార్పీ కంటే అధిక ధరలు

### -అక్రమ కల్లు విక్రయాలు

**టీ మీడియా, మే9, ఖమ్మం:** జిల్లాలోని పలు మద్యం దుకాణాల్లో ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నారనే ఆరోపణలు తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. ముఖ్యంగా ఖమ్మం నగరంతో పాటు వైరా, సత్తుపల్లి, కల్లూరు, మధిర, ఇల్లందు, పాల్వంచ, కొత్తగూడెం ప్రాంతాల్లో వినియోగదారుల నుంచి అదనపు డబ్బులు వసూలు చేస్తున్నారనే ఫిర్యాదులు వినిపిస్తున్నాయి.ఖమ్మం నగరంలోని కొన్ని వైన్ షాపుల్లో బీర్ బాటిళ్లపై రూ.10 నుంచి రూ.30 వరకు అదనంగా తీసుకుంటున్నారని మందుబాబులు ఆరోపిస్తున్నారు. రాత్రి సమయాల్లో ధరలు మరింత పెంచుతున్నారనే సమాచారం ఉంది.వైరా, సత్తుపల్లి ప్రాంతాల్లో చల్లని బీర్ పేరుతో అదనపు ఛార్జీలు వేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. కొన్ని షాపుల్లో బిల్లులు ఇవ్వకుండా నగదు వసూళ్లు జరుగుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి.మధిర, కల్లూరు మండలాల్లో పండుగలు, వీకెండ్లలో మద్యం ధరలు ఒక్కసారిగా పెరుగుతున్నాయని వినియోగదారులు అంటున్నారు."ఎమ్మార్పీఅడిగితేసరుకుఇవ్వమంటున్నారు" అని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ల్లందు, పాల్వంచ, కొత్తగూడెం ప్రాంతాల్లో బినామీ సిండికేట్లు మద్యం వ్యాపారాన్ని నియంత్రిస్తున్నాయనే ఆరోపణలు



కూడా వినిపిస్తున్నాయి. ఒకే వర్గానికి చెందిన వ్యక్తులు పలు షాపులను పరోక్షంగా నిర్వహిస్తూ ధరలను నిర్ణయిస్తున్నారని విమర్శలు ఉన్నాయి.

**లైసెన్స్‌డ్ మద్యం షాపులు..?**

తెలంగాణ ఎక్సైజ్ శాఖ అధికారిక వివరాల ప్రకారం, జిల్లాలో ప్రస్తుతం122 రిటైల్ వైన్ షాపులు,35 బార్లు 2 క్లబ్బులు కు లైసెన్స్‌తోనిర్వహణలోఉన్నట్లుఅధికారికరికార్డులుసూచిస్తున్నాయి.అదేవిధంగా జిల్లాలో తాటి కళ్లు విక్రయ కేంద్రాలు కూడా నడుస్తున్నాయని ఎక్సైజ్ శాఖ పేర్కొంది.జిల్లాలో సంప్రదాయ తాటి, ఈత చెట్ల నుంచి సేకరించే కల్లు విక్రయాలకు ప్రభుత్వం ప్రత్యేక అనుమతులు జారీ చేస్తోంది. తెలంగాణ ప్రొహిబిషన్ ఢ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో నమోదైన గౌడ సంఘాలు, లైసెన్స్ పొందిన టాపర్లు మాత్రమే కల్లు అమ్మకాలు నిర్వహించేందుకు అర్హులు. అధికారిక వివరాల ప్రకారం ఖమ్మం జిల్లాలో ప్రస్తుతం తాటి చెట్లు సుమారు 2.60 లక్షలు,ఈత చెట్లు వేల సంఖ్యలో నమోదులో,లైసెన్స్ కల్లు దుకాణాలు 180కు పైగానమోదైన టాపర్లు / గౌడ కార్మికులు -- వేల సంఖ్యలోఉన్నట్లు ఎక్సైజ్ శాఖ సమాచారం చెబుతోంది.కల్లు అమ్మకాలకు సంబంధించి ప్రభుత్వం కొన్ని నిబంధనలు అమలు చేస్తోంది .




**ఎక్సైజ్ శాఖ అనుమతి తప్పనిసరి**

నిర్దేశిత ప్రాంతాల్లో మాత్రమే అమ్మకాలు,కల్తీ కల్లు విక్రయిస్తే కఠిన చర్యలు,రాత్రి సమయ పరిమితులు అమలు,ఆరోగ్య ప్రమాణాలు పాటించడం తప్పనిసరి.కొన్ని ప్రాంతాల్లో అనుమతి లేకుండా కల్లు విక్రయిస్తున్నరు.అక్రమంగా నడుస్తున్న కల్లు దుకాణాలు, మద్యం విక్రయ కేంద్రాలపై ఆరోపణలు రోజురోజుకు పెరుగుతున్నాయి. పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో కూడా అనుమతులు లేకుండా మద్యం, కల్లు విక్రయాలు జరుగుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.అధికారిక లైసెన్స్ ఉన్న షాపులకు తోడు, కొన్ని ప్రాంతాల్లో గుట్టుచప్పుడు కాకుండా అక్రమ దుకాణాలు నడుస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో బెల్ట్ షాపుల రూపంలో మద్యం విక్రయాలు జరుగుతున్నాయని సమాచారం.

ఖమ్మం నగరం పరిసరాలతో పాటు వైరా, సత్తుపల్లి, మధిర, కల్లూరు, పాల్వంచ, కొత్తగూడెం ప్రాంతాల్లో అక్రమ మద్యం విక్రయాలపై తరచూ ఫిర్యాదులు వస్తున్నాయని తెలుస్తోంది. గ్రామాల్లో నివాస ప్రాంతాల మధ్యే కల్లు, మద్యం విక్రయాలు జరుగుతుండటంతో మహిళలు, యువత ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**అక్రమ కల్లు విక్రయాలపై అనుమానాలు**

కొన్ని చోట్ల ఎక్సైజ్ అనుమతి లేకుండా కల్లు అమ్మకాలు జరుగుతున్నాయని, కల్తీ కల్లు విక్రయాలపై కూడా ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాటి కల్లు

మిగతా 4లో



## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం..

### మూడు నెలల్లోపే దరఖాస్తుల కొలిక్కి

### -మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి



**టీ మీడియా, మే9, తిరుమలాయపాలెం:** ప్రజా దర్బార్‌లో స్వీకరించే ప్రతి దరఖాస్తును మూడు నెలల కాలపరిమితిలోపు పరిష్కరించేలా పక్కా కార్యాచరణ సిద్ధం చేసినట్లు తెలంగాణ రెవెన్యూ , గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. శనివారం తిరుమలాయపాలెం మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పాలేరు నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతి మండలాన్ని మూడు క్లస్టర్లుగా విభజించి, ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకుంటున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు నిర్వహించిన సభల్లో 14,700 దరఖాస్తులు వచ్చాయని, ఇందులో అత్యధికంగా ఇందిరమ్మ ఇళ్లు, భూ సమస్యలు, పింఛన్లు, ఉచిత విద్యుత్ కోరుతూ వచ్చినవేనని పేర్కొన్నారు. తక్షణమే పరిష్కరించే వీలున్న వాటిని స్పాట్‌లోనే పూర్తి

మిగతా 4లో

# పెరుగుతున్న సైబర్ నేరాలు



### ప్రజల్లో ఆందోళన

**టీ మీడియా, మే9, ఖమ్మం:**ఖమ్మం జిల్లాలో సైబర్ నేరాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. మొబైల్ ఫోన్లు, ఆన్‌లైన్ బ్యాంకింగ్, యు పి ఐ లావాదేవీలు విస్తరించడంతో పాటు మోసగాళ్ళు కూడా కొత్త పద్ధతులతో ప్రజలను టార్గెట్ చేస్తున్నారు. ఫేక్ కాల్స్, లింకులు, పెట్టుబడుల పేరుతో మోసాలు, ఓ టి పి దోపిడీలు, సోషల్ మీడియా హ్యాకింగ్ వంటి ఘటనలు ఎక్కువవుతున్నాయని పోలీసు అధికారులు చెబుతున్నారు.తాజాగా విడుదలైననేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో గణాంకాల ప్రకారం తెలంగాణలో 2024 సంవత్సరంలో 27,230 సైబర్ నేర కేసులు నమోదయ్యాయి. 2023లో నమోదైన 18,236 కేసులతో పోలిస్తే ఇది దాదాపు 49 శాతం పెరుగుదల కావడం ఆందోళన కలిగిస్తోంది. దేశంలోనే అత్యధిక సైబర్ కేసులు నమోదైన రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది.ఈ కేసుల్లో ఎక్కువ భాగం ఆన్‌లైన్ ఫ్రాడ్, పెట్టుబడి మోసాలు, క్రెడిట్ కార్డు మోసాలు, ఫేక్ ట్రేడింగ్ యాప్‌లు, మోసాలకు సంబంధించినవే అని నివేదికలు వెల్లడించాయి. రాష్ట్రవ్యాప్తంగా 18,922 కేసులు మోసం విభాగంలో నమోదయ్యాయని సమాచారం.ఖమ్మం జిల్లాలో కూడా సైబర్ మోసాలు పెరుగుతున్నాయని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఇటీవల ఉద్యోగాల పేరుతో,



పార్ట్ టైం వర్క్ పేరుతో, అలాగే పెట్టుబడులపై భారీ లాభాలు వస్తాయని చెప్పి పలువురి నుంచి లక్షల రూపాయలు దోచుకున్న ఘటనలు వెలుగులోకి వచ్చాయి. కొంతమంది వ్యక్తుల బ్యాంక్ ఖాతాలను "మ్యూల్ అకౌంట్స్"గా ఉపయోగించి అంతర్జాతీయ సైబర్ ముఠాలు డబ్బు బదిలీలు నిర్వహిస్తున్నట్లు దర్యాప్తుల్లో బయటపడింది. ఖమ్మం-సత్తుపల్లి ప్రాంతానికి సంబంధించిన రూ.547 కోట్ల క్రిప్టో మోసం వ్యవహారం ఇటీవల సంచలనం

మిగతా 4లో



## పాఠాలు చెబుతూనే కుప్పకూలిన టీచర్

**టీ మీడియా, మే9, ఖమ్మం :** గుండెపోటు ప్రాణాలు తీస్తోంది.. తాజాగా.. ఓ ఇంగ్లీష్ టీచర్ పాఠాలు చెబుతూనే కుప్పకూలి చనిపోవడం కలకలం రేపింది. ఈ విషాద ఘటన ఖమ్మం నగరంలో చోటుచేసుకుంది. గారపాటి జయరాజు అనే ఇంగ్లీష్ టీచర్ ఒక్కసారిగా క్లాస్ రూంలోనే కుప్పకూలి గుండెపోటుతో మృతి చెందారు. మధిరకు చెందిన ఇంగ్లీష్ టీచర్ గారపాటి జయరాజు ఆకస్మిక మరణం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ప్రస్తుతం ఖమ్మం మమతా రోడ్డులోని శ్రీ చైతన్య స్కూల్ ఒలింపియాడ్ క్యాంపస్‌లో జయరాజు పని చేస్తున్నారు. ఉపాధ్యాయులకు బోధనా విధానాల్లో మెళకువలు నేర్పిస్తూ ప్రత్యేక గుర్తింపు పొందారు. అప్పటి వరకు జయరాజు సహచర ఉపాధ్యాయులతో కలివిడిగా ఉంటూ క్లాస్ చెబుతూనే కుప్పకూలారు.అయితే.. ఈ సమయంలో ఒక్కసారిగా షాక్ కు గురైన అక్కడున్న వారు.. అతన్ని లేపే ప్రయత్నం చేశారు. అప్పటికే ఆయన పూర్తిగా స్పృహకోల్పోయారు. పరీక్షించి ఆయన చనిపోయినట్లు నిర్ధారించడంతో దిగ్భ్రాంతికి గురయ్యారు. ఈ దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి. దీనికి సంబంధించిన వీడియో వైరల్ అవుతోంది.జయరాజు గుండెపోటుతో మరణించడంతో.. ఆయన కుటుంబం కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది. ఈ ఘటన ప్రతి ఒక్కరినీ కలచివేసింది. ఆయన మరణంతో కుటుంబ సభ్యులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు కన్నీంటిపర్యంతమయ్యారు. ఈ ఘటనలో మధిరలో విషాద ఛాయలు అలుముకున్నాయి.



## ఖమ్మం రూరల్ కాంగ్రెస్ లో కొత్త ఉత్సాహం

### అంకితభావంతో పనిచేసిన నాయకులకు సముచిత గుర్తింపు

**టి మీడియా ఖమ్మం రూరల్ :** పార్టీ పట్ల అంకితభావంతో పనిచేసిన నాయకులకు కాంగ్రెస్ పార్టీ సముచిత గుర్తింపు కల్పించింది. ఖమ్మం రూరల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా చింతపల్లి గ్రామానికి చెందిన తోట వీరభద్రంను, ఏదులాపురం మున్సిపాలిటీ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షునిగా పెద్దతండా గ్రామానికి చెందిన బానోత్ కిషోర్ నాయక్‌ను నియమిస్తూ పార్టీ అధిష్టానం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నియామకాలతో ఖమ్మం రూరల్ కాంగ్రెస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. ఎన్నో ఏళ్లుగా పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్న నాయకులకు ఈ పదవులు దక్కడం పట్ల కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్థాయి నుంచి పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ ప్రజలతో మమేకమైన తోట వీరభద్రం, యువతలో మంచి గుర్తింపు పొందిన భానోత్ కిషోర్ నాయక్‌లకు బాధ్యతలు అప్పగించడం ద్వారా పార్టీ మరింత బలపడుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వీరే

**టీ.మీడియా,మే9, ఖమ్మం**

ఖమ్మం జిల్లాలో మండల అధ్యక్షులను పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశం మేరకు డీసీసీ నూతి సత్యనారాయణ గౌడ్ నియమించారు.

రఘునాథపాలెం – కేలోత్ దేవ్ సింగ్
తిరుమలాయపాలెం – కొప్పుల అశోక్
ఖమ్మం రూరల్ –తోట వీరభద్రం
కూసుమంచి – బజ్జూరి వెంకటరెడ్డి
నేలకొండపల్లి – కొడాలి గోవిందరావు
ఏదులాపురం మున్సిపాలిటీ – భానోత్ కిషోర్ ను,
ముదిగొండ – గుడిపూడి బుచ్చిరామయ్య
చింతకాని – కన్నెబోయిన గోపి యాదవ్
బోనకల్ – కర్నాటి రామకోటేశ్వరరావు
మధిర – పారుపల్లి విజయ్
ఎర్రుపాలెం – బొగ్గుల శ్రీనివాసరెడ్డి
మధిర పట్టణం – తలుపుల వెంకటేశ్వర్లు

# ఉపాధి పథకాన్ని నిర్వీర్యం చేస్తున్నకేంద్రం

**-15న కలెక్టరేట్ ధర్నా:వ్యకాస**

**టీ మీడియా,మే9,సింగరేణి(కారేపల్లి):** కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రాజ్యాంగబద్ధమైన పని హక్కును హరిస్తోందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కొండబోయిన నాగేశ్వరరావు విమర్శించారు.శనివారం కారేపల్లి మండలం ఎర్రబోడులో జరుగుతున్న ఉపాధి హామీ పని ప్రదేశాన్ని వ్యవసాయ కార్మిక సంఘం (వ్యకాస) బృందం సందర్శించింది. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.వారాల తరబడి వేతనాలు అందడం లేదని, ఫోటో విధానం కారణంగా పనుల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయని కూలీలు నాయకులకు వివరించారు. అనంతరం కూలీలకు సమస్యలు, డిమాండ్లతో కూడిన కరపత్రాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కొండబోయిన నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎన్ఆర్ఈజీఎస్ పథకానికి పేరు మార్చడమే కాకుండా నిధుల్లో కోత విధించిందన్నారు.ఉపాధి హామీ పథకం లక్ష్యాలను నీరుగార్చే విధంగా కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం నిధులు భరించాలనే షరతులు పెడుతోందన్నారు. రోజువారీ కూలీ రూ.307 ఇవ్వాల్సి ఉండగా ప్రస్తుతం రూ.150 కూడా రావడం లేదని ఆరోపించారు.పని ప్రదేశాల్లో టెంట్లు, తాగునీరు, మెడికల్ కిట్లు వంటి కనీస సౌకర్యాలు కల్పించడం లేదన్నారు.ఉపాధి కూలీలకు ప్రమాద బీమా అమలు చేసి ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.10 లక్షల సాయం అందించాలని డిమాండ్ చేశారు.ఉపాధి పనిదినాలను 200 రోజులకు పెంచి రూ.600 వేతనం, సమ్మర్ అలవెన్స్ ఇవ్వాలని కోరారు.అలాగే రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిన ఇందిరమ్మ ఆత్మీయ భరోసా రూ.12 వేలును వెంటనే అందించాలని డిమాండ్ చేశారు.ఉపాధి హామీ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 15న ఖమ్మం కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కరపాటి సీతారాములు, బోజడ్ల యాదగిరి, చరప వీరస్వామి, నర్సింగ్ సత్యనారాయణ, దుప్పెల్లి శ్రీనివాస్, కల్తి భద్రయ్య, కనికరపు వెంకన్న, లక్ష్మణ్, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



# ఆక్వా రంగాన్ని అభివృద్ధి చేయాలి



శాస్త్రవేత్త , అధిపతి. డా. శ్యాం ప్రసాద్.

**టీ మీడియా, మే 9 ,కూసుమంచి :** తాము ఇచ్చిన శిక్షణతో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా చేపల ఉత్పత్తిని గణనీయంగా పెంచి, ఆక్వా రంగాన్ని మరింత అభివృద్ధి చేయాలని పాలేరు మత్స్య పరిశోధన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త ,అధిపతి. డాక్టర్ శ్యాం ప్రసాద్ ఆకాంక్షించారు. జలాశయాల్లో చేపల పెంపకం యాజమాన్య పద్ధతులు పై జరిగిన 3 రోజుల శిక్షణ శనివారం ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడారు. శిక్షణ ద్వారా నేర్చుకున్న ప్రతి అంశాన్ని మత్స్యకారులు ఆచరణలో పెట్టి లాభాలు సాధించాలని, అలాగే బంధు మిత్రులు సహచరులకి చేపల పెంపకం గురించి క్షుణ్ణంగా వివరించాలని ఆయన కోరారు. ఇప్పటివరకు తమ కేంద్రం ద్వారా 4 వేల మంది మత్స్యకారులకు శిక్షణ పూర్తి చేశామని, వారిలో కొందరు అత్యాధునిక పద్ధతిలో చేపలు సాగుచేస్తూ అధిక లాభాలు పొందుతున్నారని ఆయన చెప్పారు. మత్స్యకారులు తమ శిక్షణని సద్వినియోగం చేసుకొని, శాస్త్రీయ పద్ధతి ద్వారా చేపలు సాగుచేసి అధిక దిగుబడులు పొందుతూ ఆర్థిక అభివృద్ధి సాధించ వచ్చని డాక్టర్ శ్యాంప్రసాద్ చెప్పారు. పాలేరు గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సబ్సిడీ రుణాలని సద్వినియోగం చేసుకొని మత్స్యకారులు ఆక్వా రంగాన్ని అభివృద్ధి చేయాలని కోరారు. పాలేరు మత్స్య పరిశోధన కేంద్ర అభివృద్ధికి, మత్స్యకారులకి తమ సహాయ సహకారం అందిస్తామని సర్పంచ్ బానోతు నాగేశ్వరరావు హామీ ఇచ్చారు. మత్స్య శాస్త్రవేత్త రవీందర్ మాట్లాడుతూ నీటి నాణ్యత ప్రమాణాల్లో భౌతిక రసాయన ప్రమాణం మోతాదులు ఉంటే జలాశయాల్లో చేపలకు ఏ వ్యాధులు సోకవని వివరించారు. మత్స్య శాస్త్రవేత్త శాంతన్న మాట్లాడుతూ జలాశయాలు చేపలు మరణాలు జరగకుండా, బయటకు వెళ్ళిపోకుండా తీసుకోవలసిన జాగ్రత్తల గురించి మత్స్యకారులకు వివరించారు .యంగ్ ప్రొఫెషనల్ బి దివ్య మాట్లాడుతూ నా స్వాడు రిపోర్టు ఫిష్ డిసీజ్ యాప్ విశిష్టతని తెలిపి యాప్ ని డౌన్లోడ్ చేయించి చేపలకి వ్యాధులు ఎలా నివారించాలో సవివరంగా చెప్పారు. అనంతరం శిక్షణ పొందిన ములుగు భద్రాద్రి కొత్తగూడెం నల్గొండ మహబూబాబాద్ నాగర్ కర్నూల్ జిల్లాలకు చెందిన మత్స్యకారులకి చేపల వేటకు ఉపయోగించు వలలు బెండులు సీసం తో పాటు సర్టిఫికెట్స్ ప్రధానం చేశారు ఈ కార్యక్రమంలో యంగ్ ప్రొఫెషనల్ అరుణ్ బ్లాక్ టెక్నాలజీ మేనేజర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# నిర్వాసితుల పట్ల అధికారుల నిర్లక్ష్యం

**జాబితా ల పేరుతో కాలయాపన**

**టీ.మీడియా,మే9,చింతూరు:** పోలవరం నిర్వాసితుల పట్ల ఆర్ అండ్ ఆర్ అధికారులు అత్యంత నిర్లక్ష్యం గా వ్యవహరిస్తున్నారని, పదే పదే డాక్యుమెంట్స్ ఇచ్చిన అనర్హులుగా ప్రకటిస్తూ నిర్వాసితులను మానసిక అందోళనకు గురిచేస్తున్నారని సిపిఎం పార్టీ చింతూరు మండల కమిటి తీవ్రంగా ఆరోపించింది. శనివారం చింతూరు పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి పల్లపు వెంకట్ మాట్లాడుతూ చింతూరు గ్రామం పోలవరం నిర్వసితుల ఆర్ ఆర్ జాబితా తయారీ లో అధికారులు చేస్తున్న నిర్లక్యం స్పష్టంగా కనిపిస్తుందని విమర్శించారు. దాని ఫలితం గా నిర్వాసితులు తీవ్ర ఆందోళన కు గురవుతున్నారని తెలిపారు.ఒక గ్రామం ఆర్ ఆర్ జాబితా తయారీలో అధికారులకు ఎన్ని సంవత్సరాలు పడుతుందని ప్రశ్నించారు. గ్రామ సభలలో, గ్రీవెన్స్ లలో, సచివాలయాలలో పదే పదే డాక్యుమెంట్స్ ఇచ్చిన అధికారులు వాటిని ఏమిచేస్తున్నారని అడిగారు.జాబితా తయారీ లో తాత్సరం వెనుక వున్న ప్రయోజనం ఏమిటో అధికారులు చెప్పాలని అన్నారు.అధికారులకు సరైన పత్రాలు పలు మార్లు నిర్వాసితులు ఇస్తున్నారని అప్పటికి అనుమానం ఉంటే ప్రభుత్వం ఏర్పాటు చేసిన పి డి ఎఫ్ కమిటి సహకారం తీసుకోవాలి కదా అని అన్నారు.ఇప్పటికైనా రాష్ట్ర ప్రయోజనం కోసం సర్వస్వం త్యాగం చేస్తున్న నిర్వసితుల పట్ల అధికారుల అయోమయం,నిర్లక్ష్యం వీడి అర్హత జాబితా ప్రకటించాలని అవసరం అయితే పి డి ఎఫ్ కమిటీ, గ్రామపెద్దల సహకారం తీసుకోవాలని సూచించారు.ప్రాజెక్టు కోసం త్యాగం చేస్తున్న ఏ ఒక్క నిర్వశితుడికి అన్యాయం జరగడానికి వీల్లులేదని అన్నారు. ఫస్ట్, సెకండ్ జాబితాలు అని కాకుండా ఒకే జాబితా లో అందరిని ప్రకటించాలని, లేని పక్షం లో ఒకే కుటుంబం వారు కాలని లో వేరు వేరు చోట్ల కేటాయించే పరిస్థితి ఉంటుందని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పష్టంగా చింతూరు ఆర్ ఆర్ జాబితా ప్రకటించాలని డిమాండ్ చేసారు. లేని పక్షం లో నిర్వసితుల తో పోరాటాన్ని రూపకల్పన చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శివర్గ సభ్యులు సీసం సురేష్, ఎర్రంశెట్టి శ్రీనివాస్, పొడియం లక్ష్మన్, మోట్టుమ్ రాజయ్య పాల్గొన్నారు.





## ప్రజానాట్యమండలి శిక్షణ శిబిరాన్ని జయప్రదం చేయండి

### సిపిఎం నాయకుల పిలుపు

**టీ మీడియా,మే09,సింగరేణి(కారేపల్లి):**ఖమ్మం జిల్లా సింగరేణి మండలం పాటిమీదగుంపు గ్రామంలో మే 17 నుంచి 19 వరకు నిర్వహించనున్న ప్రజానాట్యమండలి పాటల శిక్షణ శిబిరాన్ని జయప్రదం చేయాలని సిపిఎం వైరా కార్యదర్శి భూక్యా వీరభద్రం, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు నామ లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు.సిపిఎం సింగరేణి మండల కమిటీ సమావేశం శనివారం ఎర్రబోడులో ఎండి ఇస్మాయిల్ అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా కళలను ప్రోత్సహించడం, ప్రత్యామ్నాయ సంస్కృతి అభివృద్ధి చేయడంలో ప్రజానాట్యమండలి శిక్షణ శిబిరాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.శ్రమజీవుల కష్టాలు, ప్రజా సమస్యలను ప్రతిబింబించే కళారూపాలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు.మతోన్మాద, పెట్టుబడిదారీ శక్తులు మీడియా, సినిమా, చరిత్రను వక్రీకరిస్తున్న నేపథ్యంలో ప్రజా కళలను బలోపేతం చేయడం ద్వారానే నిజమైన సంస్కృతి ప్రజలకు చేరుతుందని పేర్కొన్నారు.పాటిమీదగుంపులో జరిగే శిక్షణ శిబిరానికి ప్రజలు హార్దికంగా, ఆర్థికంగా సహకరించి విజయవంతం చేయాలని కోరారు.ఈ సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కే నరేంద్ర, డివిజన్ కమిటీ సభ్యులు వజ్జ రామారావు, మండల కమిటీ సభ్యులు దాసరి మల్లయ్య, వల్లబోయిన కొండల్‌రావు, కేశగాని ఉపేందర్, శాఖ కార్యదర్శి కరపాటి సీతారాములు, తేజావత్ చందర్, బానోతు కిషన్, సోషల్ మీడియా మండల కన్వీనర్ ధారావత్ వినోద్‌కుమార్, ఎజ్జు యేసురత్నం తదితరులు పాల్గొన్నారు.

## మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా బజ్జూరి



**టీ మీడియా ,మే 9 ,కూసుమంచి:**కాంగ్రెస్ పార్టీ కూసుమంచి మండల అధ్యక్షుడిగా బజ్జూరి వెంకటరెడ్డి నియమితులయ్యారు. తెలంగాణ రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు ఖమ్మం జిల్లా పార్టీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ శనివారం ప్రకటన విడుదల చేశారు. మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన వెంకటరెడ్డి మొదటినుంచి రాజకీయాల్లో రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అనుచరుడుగా కొనసాగుతూ మండలంలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి చేశారు కూసుమంచి మండల కాంగ్రెస్ పార్టీ బాధ్యతలు అప్పగిస్తూ నియమించిన రాష్ట్ర పార్టీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఖమ్మం జిల్లా పార్టీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ, రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కి బజ్జూరి కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మక నియామక మేరకు తాను మండలంలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని బజ్జూరి ప్రతిజ్ఞ చేశారు. ఇప్పటివరకు పార్టీలో తనకి సహకరించిన మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు యువత మహిళలకు బజ్జూరి వెంకటరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. కూసుమంచి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా బజ్జూరి వెంకటరెడ్డి నియామకం పట్ల మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు వట్టి శ్రీనివాసరెడ్డి, నాయకులు కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

## ఘనంగా పెద్దమ్మ తల్లి జాతర



**టీ మీడియా ,మే 9 , చుంచుపల్లి :** చుంచుపల్లి మండలం పెనుబల్లి గ్రామం నాయకులగూడెంలో గత మూడు రోజులుగా పెద్దమ్మ తల్లి జాతర భక్తిశ్రద్ధలతో వైభవంగా కొనసాగుతోంది. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే ఈ జాతరలో గ్రామ ప్రజలు, పరిసర ప్రాంతాల భక్తులు భారీ సంఖ్యలో పాల్గొంటారు. పెద్దమ్మతల్లి, పులి రాజు వివిధ వేషధారణలతో గ్రామం మొత్తం మేళ తాళాలతో ఊరేగింపు నిర్వహించారు. జాతరలో భాగంగా శనివారం సాయంత్రం అడవిలో నుండి సరుగులు, కర్రలను సంప్రదాయబద్ధంగా తీసుకువచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం ఉదయం నిప్పుల గుండం ఏర్పాటు చేసి భక్తులు పూలు తొక్కే కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. అలాగే పెద్దమ్మ తల్లి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించి, మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేపట్టనున్నట్లు సర్పంచ్ రెడ్డి సుజాత తెలిపారు.

# లాడ్జిల యాజమాన్యాలు నిబంధనలను పాటించాలి

**-జిల్లా ఎస్పీ రోహిత్ రాజు**





**టీ మీడియా ,మే 9 ,కొత్తగూడెం :**జిల్లాలో లాడ్జిలను నడిపించే యజమానులు నేరచేదనలో,నేరాలను నియంత్రించడంలో పోలీసు వారికి సహకరించాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సూచించారు. శనివారం కొత్తగూడెం పట్టణంలోని ఐఎంఎ ఫంక్షన్ హాలులో లాడ్జిల నిర్వాహకులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి ఎస్పీ వారికి పలు సూచనలను చేశారు. లాడ్జిలలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు తావు లేకుండా ఖచ్చితమైన నియమ నిబంధనలను పాటిస్తూ సామాజిక బాధ్యతను కలిగి ఉండి పోలీసు వారికి సహకరించాలని కోరారు.ఈ సందర్భంగా లాడ్జి యాజమాన్యాలకు పలు సూచనలను చేశారు.

**పాటించాల్సిన ముఖ్యమైన సూచనలు**

ప్రతి అతిధి నుండి ఖచ్చితంగా ప్రభుత్వం జారీ చేసిన ఎదో ఒక గుర్తింపు కార్డు (ఆధార్, ఓటర్ ఐడి, పాస్పోర్ట్ డ డ్రైవింగ్ లైసెన్స్) తీసుకోవాలి.లాడ్జిలో చేరే వారి పేరు,పూర్తి చిరునామా,ఫోన్ నంబర్,వచ్చిన సమయం మరియు వెళ్ళే సమయాన్ని రిజిస్టర్లో స్పష్టంగా నమోదు చేయాలి.గదుల్లో ఉన్న వారిని కలపడానికి వచ్చే విజిటర్లను నేరుగా లోపలికి పంపకూడదు.రిసెప్షన్ వద్ద వారి వివరములు,ఫోన్ నంబర్ నమోదు చేసుకున్న తర్వాత వంపాలి.విదేశీయులు ఎవరైనా లాడ్జిలో స్టే చేస్తే,వారి వివరములు 24 గంటల లోపు ఆన్లైన్ ద్వారా రూపంలో పోలీసులకు సమర్పించాలి. ప్రతిరోజు ఉదయం 6.00 గంటలకు రిజిస్టర్లోని సమాచారము,గుర్తింపు కార్డుల జిరాక్స్ కాపీలను సంబందిత పోలీస్ స్టేషన్లో సమర్పించాలి. ఎంట్రన్స్,రిసెప్షన్ మరియు కారిడార్,బయటవైపు రోడ్డు కనిపించే విధంగా,రాత్రి వేళల్లో కూడా స్పష్టంగా కనిపించేలా పని చేసే స్థితిలో ఉన్న సి సి టివి కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి.వీటి ఫుటేజిని కనీసం 30 రోజుల వరకు భద్రపరచాలి. అనుమానాస్పదంగా అనిపించే లగేజిని తనిఖీ చేయాలి.అధిక మొత్తంలో బ్యాగులు లేదా అనుమానిత వస్తువులు ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. అనుమానిత వ్యక్తులు ఎవరైనా ఉన్నా లేదా తప్పుడు వివరాలు ఇస్తున్నారని అనిపించినా,లాడ్జి గదుల్లో మద్యం సేవించడం, జూదం ఆడటం లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా. అపరిచిత వ్యక్తులు గ్రూపులుగా వచ్చి బస చేసినా వెంటనే స్థానిక పోలీసు స్టేషన్ కి లేదా డయల్ 100కు సమాచారం అందించాలి.స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్ హెచ్ ఓ నంబర్లను ఎల్లప్పుడూ రిసెప్షన్ వద్ద అందుబాటులో ఉంచుకోవాలి.పోలీసులు ఎవరైనా నిందితుల కోసం గాలిస్తున్నపుడు, వారికి సహకరించాలి. ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించాలి మరియు మంటను అదుపు చేసే వస్తువులను అందుబాటులో ఉంచుకోవాలి.అత్యవసర ఎగ్జిట్ ను కలిగి ఉండాలి. రిసెప్షన్ డెస్క్ క్రింద అత్యవసర అలారం ఏర్పాటుచేసుకోవాలి.ఏదైనా ప్రమాదం లేదా గొడవ జరిగినప్పుడు దాన్ని నొక్కితే వెంటనే అలారం మోగేలా లేదా దగ్గరలోని పోలీస్ స్టేషనుకు సమాచారం వెళ్ళేలా ఉండాలి. సిబ్బంది యొక్క వివరములు,వారి పూర్వాపరాలను పోలీసు వెరిఫికేషన్ చేయించుకోవడం మంచిది. లాడ్జిలో సెక్యూరిటీ గార్డులను నియమించుకుంటే,వారు గుర్తింపు పొందిన ఏదైనా సెక్యూరిటీ ఏజెన్సీకి చెందిన వారై ఉండాలి.వారి వెరిఫికేషన్ తప్పనిసరిగా చేసి ఉండాలి.ఈ నిబంధనలను ఉల్లంఘిస్తే,చట్టపరమైన చర్యలు తీసుకోవడమే కాకుండా,లాడ్జి లైసెన్సు రద్దు చేయబడుతుంది.

# మాజీ మంత్రి వనమాతో నామ భేటీ

**-పాల్వంచ పట్టణంలో పర్యటన**



**టీ మీడియా ,మే 9 ,పాల్వంచ:** బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు శనివారం పాల్వంచ పట్టణంలో పర్యటించారు. ముందుగా మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు స్వగృహానికి వెళ్లి వారితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, పార్టీ బలోపేతంపై చర్చించారు. అంతకు ముందు వనమా ఇంటి వద్ద మాజీ ఎంపీ నామ కు పాల్వంచ రూరల్, పట్టణ బీఆర్ఎస్ నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్లుకు మాజీ ఎంపీ నామ పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం మాజీ ఎంపీ నామ మాట్లాడుతూ కేసీఆర్, కేటీఆర్ సూచనలకు అనుగుణంగా పార్టీ అభివృద్ధికి కట్టుబడి పనిచేయాలని నాయకులకు పిలుపునిచ్చారు. నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్లు ప్రజలకు చేరువగా ఉండి సేవా కార్యక్రమాలు కొనసాగించాలని సూచించారు ఆ తర్వాత పాల్వంచ పట్టణ వాస్తవ్యులు దొప్పలపూడి సురేష్ బాబు-సత్యవాణి దంపతుల కుమార్తె వివాహ వేడుక శనివారం రాత్రి జరగనున్న నేపథ్యంలో ముందుగానే మధ్యాహ్నం వారి స్వగృహానికి వెళ్లి నూతన వధువును ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. అక్కడ నుండి బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, పాల్వంచ పట్టణ వాస్తవ్యులు రమణమూర్తి నాయుడు నివాసానికి వెళ్లి ఇటీవల ఆయనకు సర్జరీ జరగగా వివరాలు అడిగి తెలుసుకొని వారిని పరామర్శించారు. వైద్యుల సూచనలు పాటించాలని సూచించి తిరిగి త్వరగా కోలుకుని మళ్లీ ప్రజా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు. నాయుడు కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర నాయకులు వనమా రాఘవ, మోరంపూడి ప్రసాద్ రావు, పాల్వంచ మండల మాజీ అధ్యక్షులు, పూసల విశ్వనాథం, మల్లెల శ్రీరామ్ మూర్తి, బీఆర్ఎస్ కార్పొరేటర్లు గోవాడ గుణచరిత్, సింధు తపస్వి, గుగులోత్ రాంబాబు, కో-ఆపరేటివ్ సొసైటీ ఉపాధ్యక్షులు కాంపెల్లి కనకేష్ పటేల్, మాజీ ఎంపీపీ సరస్వతి, ఉర్దుగా మాజీ చైర్మన్ అన్వర్ భాష, చిన్నంశెట్టి రంగయ్య, రెడ్డి నాయక్, నాయకులు ముత్యాల ప్రవీణ్, దాసరి నాగేశ్వరరావు, వాకదాని కోటేశ్వరరావు, భూక్య వీరన్న, శంకర్, జూపెల్లి దుర్గాప్రసాద్, హర్షవర్ధన్, ప్రభాకర్ రెడ్డి, పత్తిపాటి శ్రీను, దాసరి సురేష్, బిఎల్ నాయుడు, వంశీ, బొడుగుల శ్రీధర్, కంచర్ల రామారావు, అఖిల్, సేమియా, కాలం రాజమ్మ, ఏనుగుల శీను, ఆర్ఎంపి శీను, హైమద్, బత్తుల శ్రీనివాస్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# జనగణన ప్రతి పౌరుడి బాధ్యత



**అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి**

**టీ మీడియా ,మే 9 ,ఖమ్మం:**జనగణన ప్రతి పౌరుడి బాధ్యత అని, సమగ్ర సమాచారం దేశాభివృద్ధికి పునాది అని జిల్లా అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.జనగణనపై జిల్లా ప్రజలకు అవగాహన కల్పించేందుకు శనివారం ఉదయం ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియం నుండి జడ్పీ సెంటర్ వరకు నిర్వహించిన జనగణన అవగాహన వాక్ ర్యాలీని జిల్లా అదనపు కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించి, క్రీడాకారులు, ప్రజలు, వాకర్స్ తో కలిసి ర్యాలీ లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. జనగణన ప్రక్రియలో భాగంగా స్వీయ గణన విధానం మే 10 వరకు జరుగుతుందని, ఈ స్వీయ గణనలో స్వచ్ఛందంగా నమోదు చేసుకోసుకొని, ఈ స్వీయ నమోదు శాతాన్ని మరింతగా పెంచాలని, అందరూ ఈ స్వీయ గణనలో నమోదు చేసుకోవాలని కోరారు.మే 11వ తేదీ నుంచి ఇంటింటి గణన ప్రక్రియ ప్రారంభం అవుతుందని, ఇందులో మొత్తం 34 ప్రశ్నలు ఉంటాయని, ఈ వివరాలు అంతా కూడా గోప్యంగా ఉంటుందని, అన్ని ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాలని, ప్రజలు ఎటువంటి భయం పడాల్సిన అవసరం లేదని, దీనికి సంబంధించిన సహాయ కేంద్రం కూడా ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.అదే విధంగా జనగణనపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు నిర్వహించిన అవగాహన వాక్‌లో అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, ప్రజలు ఉత్సాహంగా పాల్గొనడం అభినందనీయమన్నారు.జిల్లాలోని ప్రతి కుటుంబం సరైన వివరాలు అందించి జనగణన విజయవంతానికి సహకరించాలని కోరారు. జనగణన ద్వారా ప్రభుత్వానికి ప్రజల సామాజిక, ఆర్థిక పరిస్థితులపై స్పష్టమైన అవగాహన ఏర్పడి, సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయడానికి దోహదపడుతుందని తెలిపారు.దేశ అభివృద్ధికి ఖచ్చితమైన గణాంకాలు ఎంతో అవసరమని, "మన సమాచారం -- మన భవిష్యత్తు" అనే భావనతో ప్రతి ఒక్కరూ జనగణన కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారఈ కార్యక్రమంలో సీపీవో శ్రీనివాస్, డీఎస్డీవో సునీల్ రెడ్డి, ఎస్ఓ శ్రీధర్, డిప్యూటీ మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ అనిల్ కుమార్, ఇతర వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు, క్రీడాకారులు, యువత, విద్యార్థులు, నగర ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



# 15న 'గ్రామీణ బంద్'ను జయప్రదం చేయండి

**ఏఐఏడబ్ల్యూయూ రాష్ట్ర కమిటీ**

**సభ్యులు జాజిరి శ్రీనివాస్**

**టీ మీడియా ,మే 9 , సత్తుపల్లి**
ఉపాధి హామీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 15వ తేదీన నిర్వహించనున్న గ్రామీణ బంద్ ను విజయవంతం చేయాలని ఆల్ ఇండియా అగ్రికల్చర్ వర్కర్స్ యూనియన్ (ఏఐఏడబ్ల్యూయూ) రాష్ట్ర కమిటీ సభ్యులు జాజిరి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శనివారం బేతుపల్లి గ్రామంలో ఉపాధి హామీ కూలీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టారు. గత రెండు నెలలుగా నిలిచిపోయిన ఉపాధి హామీ వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పనిని ఏడాదికి 200 రోజులకు పెంచాలన్నారు. అలాగే రోజువారీ కూలిని రూ. 600 చేయాలన్నారు. పని ప్రదేశంలో ఉదయం, సాయంత్రం ఫొటోలు అప్‌లోడ్ చేసే 'నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్' (ఎన్ఎంఎంఎస్) విధానాన్ని వెంటనే రద్దు చేయాలన్నారు. పని ప్రదేశాల్లో ఫోన్ సిగ్నల్ సమస్యల వల్ల కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఎండలు తీవ్రంగా ఉన్నందున పని ప్రదేశాల్లో తాగునీరు, నీడ కోసం టెంట్లు, ఓఆర్ఎస్, మెడికల్ కిట్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వ్యవసాయ కార్మికుల రక్షణ కోసం సమగ్ర చట్టాన్ని తీసుకురావాలని, వీబీ జీ రామ్‌జీ చట్టాన్ని రద్దుచేసి పాత పేరుతో ఉన్న ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పెంచిన పింఛన్లను వెంటనే అమలు చేయాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నీరుగార్చి, పేదలపై కక్ష గట్టిందని జాజిరి శ్రీనివాస్ విమర్శించారు. సమ్మర్ అలవెన్స్‌ను కొనసాగించాలని, కార్మికుల సంక్షేమాన్ని విస్మరించకూడదని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారం కోసం ప్రతి ఒక్కరూ ఈనెల 15న జరిగే బంద్‌లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యకాస మండలం కార్యదర్శి కువ్వారపు లక్ష్మణరావు, సభ్యులు నల్లంటి జ్యోతి, గద్దల గంగరాజు, ఇనపనూరి రాణి, ఒరుగంటి చంద్రరావు, బలగాని సత్యనారాయణ, బజ్జూరి ఈశ్వరమ్మ, కాకాని రాములు, కంటేపూడి చెల్లెమ్మ పాల్గొన్నారు.

## మద్యం షాపుల

పేరుతో ఇతర పదార్థాలు కలిపి విక్రయిస్తున్నారనే అనుమానాలతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

**బినామీ సిండికేట్ల హవా..?**
జిల్లాలో పలువురు అసలు లైసెన్స్ హోల్డర్ల పేర్లతో షాపులు నడుస్తున్నా, వెనుక నుంచి రాజకీయ అనుబంధాలు ఉన్న బినామీ గుంపులు వ్యవహారం నడిపిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఒకే వర్గానికి చెందిన వ్యక్తులు పలు దుకాణాలను పరోక్షంగా నియంత్రిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.దీంతో ధరల నియంత్రణ పూర్తిగా సిండికేట్ చేతుల్లోకి వెళ్లిపోయిందని, అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**బెల్ట్ షాపుల హవా**
గ్రామీణ ప్రాంతాల్లో అధికారిక వైన్ షాపుల నుంచి మద్యం తెచ్చి చిన్నచిన్న దుకాణాల్లో అధిక ధరలకు విక్రయిస్తున్న బెల్ట్ షాపులు పెరిగిపోయాయని స్థానికులు చెబుతున్నారు. పాఠశాలలు, కాలనీలు, బస్ స్టాండ్ల సమీపంలో కూడా విక్రయాలు జరుగుతున్నాయని ఆరోపిస్తున్నారు.

**యువతపై ప్రభావం**
అక్రమ మద్యం దుకాణాల కారణంగా యువత మద్యం బారిన పడుతోందని సామాజిక కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో రాత్రివేళ గొడవలు, కుటుంబ కలహాలు పెరుగుతున్నాయని చెబుతున్నారు.

**అధికారుల చర్యలు ఏమిటి..?**
ఇటీవల ఎక్సైజ్ శాఖ కొన్ని ప్రాంతాల్లో దాడులు నిర్వహించి అక్రమ మద్యం, గుడుంబా స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. అనుమతి లేకుండా నడుస్తున్న దుకాణాలపై కేసులు నమోదు చేస్తున్నామని అధికారులు చెబుతున్నారు.అయితే ప్రజలు మాత్రం "దాడులు ఒకట్రెండు రోజులు మాత్రమే... తర్వాత మళ్లీ అదే పరిస్థితి" అంటూ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో అక్రమ మద్యం, కల్లు దందాపై ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.ఇదిలా ఉండగా, ఎక్సైజ్ శాఖ అధికారులు ఫిర్యాదులు అందితే తనిఖీలు నిర్వహించి కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## పెరుగుతున్న సైబర్ నేరాలు

సృష్టించింది. ఇటీవల ఖమ్మం జిల్లాలో పలువురు వ్యక్తులు ఆన్‌లైన్ ట్రేడింగ్, క్రిప్టో కరెన్సీ పెట్టుబడుల పేరుతో లక్షల రూపాయలు కోల్పోయినట్లు పోలీసులకు ఫిర్యాదులు అందాయి. వాట్సాప్, టెలిగ్రామ్ గ్రూపుల ద్వారా నకిలీ స్క్రీన్‌షాట్లు చూపించి పెట్టుబడులు పెట్టేలా ప్రలోభపెడుతున్నారని పోలీసులు తెలిపారు.

ప్రారంభంలో చిన్న మొత్తాలు తిరిగి ఇచ్చి నమ్మకం కలిగించి, తర్వాత పెద్ద మొత్తాలను దోచుకునే విధానాన్ని మోసగాళ్లు అనుసరిస్తున్నారు.ఇక సోషల్ మీడియా ద్వారా కూడా మోసాలు పెరుగుతున్నాయి. ఫేక్ ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్లు, ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లు, డీప్‌ఫేక్ వీడియోల ద్వారా ప్రజలను మోసం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని సైబర్ పోలీసులు వెల్లడించారు. హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు ఇటీవల 184 సోషల్ మీడియా ఖాతాలను తొలగించినట్లు సమాచారం.సైబర్ నేరాల నియంత్రణ కోసం తెలంగాణ పోలీసులు ఆధునిక సాంకేతికతను వినియోగిస్తున్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా పర్యవేక్షణ, డేటా విశ్లేషణ, సైబర్ ట్రాకింగ్ చర్యలు చేపడుతున్నారు.ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. తెలియని లింకులు క్లిక్ చేయకూడదని, ఓ టి పి లు ఎవరికీ చెప్పకూడదని, అనుమానాస్పద కాల్స్ వస్తే వెంటనే స్పందించవద్దని హెచ్చరిస్తున్నారు. మోసానికి గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేయడం లేదా అధికారిక సైబర్ క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని సూచిస్తున్నారు.ఈ నేపథ్యంలో ఖమ్మం జిల్లా పోలీసులు అవగాహన కార్యక్రమాలను ముమ్మరం చేశారు. పాఠశాలలు, కళాశాలలు, గ్రామపంచాయతీలు, మార్కెట్లు, ప్రజా ప్రదేశాల్లో సైబర్ భద్రతపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. "సైబర్ సేఫ్టీ -- మీ చేతుల్లోనే" అనే నినాదంతో ప్రజలకు సూచనలు అందిస్తున్నారు.సాంకేతికత ఎంత వేగంగా అభివృద్ధి చెందుతోందో, సైబర్ నేరగాళ్లు కూడా అంతే వేగంగా కొత్త మార్గాలు అన్వేషిస్తున్నారని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అందుకే ప్రజల్లో అవగాహన పెరగడం, అప్రమత్తంగా ఉండటం ద్వారానే ఇలాంటి మోసాలను అరికట్టవచ్చని అధికారులు సూచిస్తున్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం..

చేస్తున్నామని, మిగిలిన వాటిని మూడు నెలల గడువులోపే పరిష్కరించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.

**మే నెలాఖరు నుంచి రెండో విడత ఇళ్లు**
ప్రజా ప్రభుత్వం కొలువుదీరిన మొదటి ఏడాదిలోనే 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందని మంత్రి గుర్తు చేశారు. ఇంటి నిర్మాణ పురోగతి ఆధారంగా లబ్ధిదారులైన మహిళల బ్యాంకు ఖాతాల్లోనే నేరుగా నిధులు జమ చేస్తూ పారదర్శకతకు పెద్దపీట వేశామన్నారు. మే నెలాఖరు నుంచి రెండో విడత ఇళ్ల మంజూరు ప్రక్రియను ప్రారంభించనున్నట్లు ప్రకటించారు.

**ధరణి చిక్కుముడులకు 'భూ భారతి'**
గత ప్రభుత్వ హయాంలో ధరణి పోర్టల్ తెచ్చిన తప్పుల వల్ల రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని మంత్రి విమర్శించారు. ఒకే సర్వే నంబర్‌లోని కొంత భూమి సేకరణ జరిగితే.. మొత్తం నంబర్‌ను నిషేధిత జాబితాలో పెట్టడం వంటి అవకతవకలను సరిదిద్దడానికే 'భూ భారతి' కార్యక్రమాన్ని తీసుకొచ్చామని వివరించారు. సాదా బైనామా దరఖాస్తులను పేదలకు న్యాయం జరిగేలా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

**ధాన్యం కొనుగోళ్లపై భరోసా**
రైతులు పండించిన ప్రతి గింజను మద్దతు ధరతో ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు ఆందోళన చెందవద్దని మంత్రి భరోసా ఇచ్చారు. సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందిస్తున్నామని, వరితో పాటు మొక్కజొన్నను కూడా పూర్తిస్థాయిలో సేకరిస్తామని తెలిపారు. రైతును రాజును చేయడమే లక్ష్యంగా ఇప్పటికే రూ.2 లక్షల లోపు రుణమాఫీని అమలు చేశామని చెప్పారు. గతంలో రైతులపై బేడీలు వేసిన వారు నేడు కొనుగోలు కేంద్రాల వద్ద విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ హరినాథ్ బాబు, ఆత్మ కమిటీ చైర్మన్, జిల్లా స్థాయి అధికారులు, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మొక్కజొన్నను షరతులు లేకుండా కొనుగోలు

**-- బీఆర్ఎస్ నాయకుడు దిండిగాల రాజేందర్**



**టీ మీడియా ,మే 9 , ఇల్లెందు**: అకాల వర్షాలకు తడిసిన మొక్కజొన్నను ప్రభుత్వమే ఎలాంటి షరతులు లేకుండా కొనుగోలు చేయాలని బీఆర్ఎస్ పార్టీ వ్యవస్థాపక సభ్యుడు, సీనియర్ నాయకుడు దిండిగాల రాజేందర్ డిమాండ్ చేశారు. శనివారం ఇల్లెందు మండలం రేపల్లెవాడ కొనుగోలు కేంద్రాన్ని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు మండల మాజీ అధ్యక్షుడి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి తడిసిన మొక్కజొన్నను పరిశీలించారు. రైతులతో కలిసి కొనుగోలు కేంద్రం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా దిండిగల రాజేందర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక సకాలంలో ధాన్యం సేకరించటం లేదని, ధాన్యం తెచ్చి రోజుల తరబడి ఎదురు చూడాల్సి వస్తుందన్నారు. సరైన వసతులు లేక టార్పాలిన్లు లేక ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం తడిసిపోతున్నా పట్టించుకునే నాథుడు లేడన్నారు. తడిసిన ధాన్యాన్ని కొనడం లేదని, గన్ని బ్యాగ్స్ సరఫరా చేయడం లేదని, మార్కెట్ లో దళారీలు రాజ్యం ఏలుతున్నారని, రైతుల పొట్టగొట్టి లాభలు గడిస్తున్నారని, మార్కెట్ కమిటీ అధికారులు దళారీలకే కొమ్ముగాస్తున్నట్లు తెలిపారు. వెంటనే మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్, పీఏసీఎస్ సీఈఓ తో మాట్లాడి రైతులకు న్యాయం చేయాలని, ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలని, దళారీలను అరికట్టాలని లేకుంటే పెద్దఎత్తున ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అబ్దుల్ జబ్బార్, అబ్దుల్ నబీ, మాజీ వైస్ ఎంపీపీ ప్రమోద్, దేరింగుల పోషం, మాజీ కో ఆప్షన్ మెంబర్ ఘాజి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మూడు కృష్ణ ప్రసాద్, సత్యనారాయణ, నారపాక వసంతరావు, స్థానిక సర్పంచులు యేపే శంకర్, ఎట్టి రమణ, ఉద్యమకారులు ఆధురి రవి, రాంలాల్ పాసి, రాచపల్లి శ్రీను, సుందరి శ్రీను, వాసు, సునీల్, మూలగుండ్ల ఉపేందర్ రావు, లలిత్ కుమార్ పాసి, శ్రీకాంత్, హరిప్రసాద్ యాదవ్, సురేష్, కామేపల్లి ఉదయ్, గడ్డి శ్రీను, చిన్నారి, ముత్తయ్య, రాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.